

పేదలకు న్యాయం జరగాలంటే మోదీని గెలిపించాలి

- బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్



లింగాపూర్‌లో మోకుతో ఎంపీ బండి సంజయ్‌కుమార్

శంకరపట్నం/మానకొండూర్, మార్చి6: పేదలకు న్యాయం జరగాలంటే రానున్న ఎంపీ ఎన్నికల్లో మోదీని మరోసారి గెలిపించాలని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలంలోని గద్దపాక, కాచాపూర్, మెట్‌పల్లి, లింగాపూర్, కొత్తగట్టు, కేశవపట్నం గ్రామాల్లో , మానకొండూర్ మండలంలోని గట్టుదుద్దెనపల్లి, చెంజర్ల, ఈదులగట్టెపల్లి, అన్నారం, మానకొండూర్ గ్రామాలలో ఎంపీ బండి సంజయ్ ప్రజాహిత యాత్ర జరిగింది. ఈ సందర్భంగా లింగాపూర్ గ్రామంలో ఎంపీ బండి సంజయ్ కల్లు తాగారు. గౌడన్న మోకు ధరించి, కల్లు ఆరోగ్యానికి మంచిదని, ఆరోగ్య నిపుణులు సైతం ఈ విషయాన్ని వెల్లడించారని గుర్తు చేశారు. ఈ మేరకు గీత కార్మికుల కష్టసుఖాలను తెలుసుకు న్నారు. అనంతరం కేశవపట్నం, మానకొండూర్ మండలాల్లో ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి మోదీని ముఖ్యమంత్రి కలవడంపై బీఆర్ఎస్ నేతలు రాజకీయం చేయడాన్ని బండి సంజయ్ తప్పుపట్టారు. ప్రధాని మోదీ ఎన్నోసార్లు తెలంగాణ రాష్ట్రానికి వస్తే దొంగలా దాక్కున్న వ్యక్తి కేసీఆర్ అన్నారు. ఆరు గ్యారంటీలతో కాంగ్రెస్ ప్రజలను మోసం చేస్తోంద న్నారు. అనంతరం గట్టుదుద్దెనపల్లి ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. శంకరపట్నం బీజేపీ మండలాధ్యక్షుడు ఏనుగుల అనిల్, మాడ వెంకట్‌రెడ్డి, అలివేలి సమ్మిరెడ్డి, దండు కొంరయ్య తదితరులు పాల్గొన్నారు. మానకొండూర్‌లో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు గుర్రాల వెంకట్‌రెడ్డి, రంగు బాస్కరాచారి, సొల్లు అజయ్‌వర్మ, మండల అధ్యక్షులు రాపాక ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు తేలనున్న కాంగ్రెస్ అభ్యర్థులు

చివరి ప్రయత్నాలు చేస్తున్న నేతలు

- ఢిల్లీలో ఏఐసీసీ ఎన్నికల కమిటీ సమావేశం
- తొలి జాబితాలోనే కరీంనగర్, పెద్దపల్లి అభ్యర్థులు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పోటీకి నిలుపనున్న అభ్యర్థులెవరన్నది గురువారం తేలిపోనున్నది. ఢిల్లీలో జరిగే ఏఐసీసీ కేంద్ర ఎన్నికల కమిటీ సమావేశానంతరం అభ్యర్థులను ప్రకటిస్తారని పార్టీవర్గాలు పేర్కొంటు న్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా 17 లోక్‌సభ స్థానాలుండగా తొమ్మిది స్థానాలకు అభ్యర్థులను తొలివిడతలో ప్రకటిస్తారని సమాచారం. ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలోని కరీంనగర్, పెద్దపల్లి లోక్‌సభ నియోజకవర్గాల అభ్యర్థులను తొలి విడతలోనే ప్రకటిస్తారని చెబుతున్నారు. ఇటీవల రాష్ట్రంలో స్క్రీనింగ్ కమిటీ సమావేశం నిర్వహించి 10కిపైగా స్థానాల్లో అభ్యర్థులను గుర్తించి ప్రాధాన్యతా క్రమంలో ఏఐసీసీకి పేర్లను పంపించారు. ఈ జాబితాలో కరీంనగర్ స్థానం నుంచి ఒక్క మాజీ ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి పేరును మాత్రమే పంపించారని, పెద్దపల్లి లోక్‌సభ స్థానం నుంచి గడ్డం వంశీ, మాజీ ఎంపీ జి.సుగుణకుమారి, పెరుక శ్యాం పేర్లు ఉన్నాయని చెబుతున్నారు. ఢిల్లీలో జరిగే కేంద్ర ఎన్నికల కమిటీ సమావేశంలో ఈ జాబితాపైన కాకుండా కమిటీ సభ్యుల దృష్టిలో ఉన్న పేర్లపై కూడా చర్చించి నిర్ణయం తీసుకునే అవకాశముందని పార్టీవర్గాల భోగట్టా. కరీంనగర్ స్థానం నుంచి టికెట్ ఆశిస్తున్న ప్రవీణ్‌రెడ్డికి గత అసెంబ్లీ



ఎన్నికల సమయంలో పార్లమెంట్‌కు పోటీచేసే అవకాశం కల్పిస్తామని హామీ ఇవ్వడంతో అసెంబ్లీ బరి నుంచి తప్పుకున్నారని అందుకే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆయన పేరును మాత్రమే పరిగణలోకి తీసుకోవాలని కోరడంతో సింగిల్ నేమ్ ఢిల్లీకి పంపించారని సమాచారం. అయితే ఈ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్న మంత్రి పొన్నం ప్రభాకర్, మాజీ శాసనసభ్యుడు వెలిచాల జగపతిరావు తనయుడు రాజేందర్‌రావు అభ్యర్థిత్వం పట్ల సుముఖంగా ఉన్నారని చెబుతున్నారు. తనకున్న పరిచయాలతో ఢిల్లీ స్థాయిలో రాజేందర్‌రావు పేరు చర్చకు వచ్చేలా చూసే అవకాశముందని కూడా పార్టీవర్గాలు చర్చించుకుం టున్నాయి. రాహుల్‌గాంధీ టీంసభ్యుడిగా ఉన్న రుద్ర సంతోష్‌కుమార్ ఏఐసీసీలో తనకున్న సంబంధాలతో ఆ స్థాయిలోనే తన అభ్యర్థిత్వం ఖరారు కోసం ప్రయత్నాలు చేస్తున్నారని చెబుతున్నారు. ఈ ముగ్గురిలో అధిష్టాన ఆమోదం ఎవరికి లభిస్తుందో గురువారం తేలిపోయే అవకాశమున్నది. పెద్దపల్లిలో గడ్డం వంశీ పేరు మొదటి వరుసలో ఉన్నట్లు చెబుతున్నా, మంత్రి శ్రీధర్‌బాబు మాత్రం ఆయన అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకిస్తున్నారని అంటు న్నారు. నియోజకవర్గంలో మాదిగ సామాజికవర్గం ఎక్కువగా ఉండడంతో మాదిగ అభ్యర్థికే అవకాశం కల్పించా లని ఆవర్గం డిమాండ్ చేస్తున్నది. లోక్‌సభ స్థానం ఏర్పడినప్పటి నుంచి మాదిగలకు ఒకసారి మాత్రమే అవకాశం ఇచ్చారని, ఈసారి అలా జరిగేందుకు అంగీకరించమని పేర్కొంటూ ఆ వర్గానికి చెందిన వారు తమ డిమాండ్‌ను వివిధ ఆందోళనలు, ప్రదర్శనల ద్వారా తెలియజేస్తుండడంతో అధిష్టానవర్గం కూడా ఆలోచనలో పడ్డట్లు చెబుతు న్నారు. ఇటీవలే బీఆర్ఎస్‌నుంచి సిట్టింగ్ ఎంపీ బి. వెంకటేశ్‌నేత కాంగ్రెస్‌లో చేరారు. నేతకాని వర్గానికి చెందిన ఆయనకు టికెట్ ఇస్తామన్న హామీతో పార్టీలో చేరారని ఆయన అవకాశాలను కూడా తోసిపుచ్చలేనమని అంటు న్నారు. ఇక్కడ కూడా అభ్యర్థి ఎవరన్నది గురువారం తేలిపోనున్నది.

రూ.577.52 కోట్ల బడ్జెట్‌కు ఆమోదం

బల్దియాలో అసంపూర్తి అభివృద్ధి పనులు, తాగునీటి సమస్యపై చర్చ



సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ యాదగిరి సునీల్‌రావు

కరీంనగర్ టౌన్, మార్చి 6: నగరపాలక సంస్థ 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన రూ.577.52 కోట్ల అంచనా బడ్జెట్‌కు, 2023-24 ఆర్థిక సంవత్సరం సవరించిన బడ్జెట్ రూ.442.55 కోట్లకు కౌన్సిల్ ఆమోదముద్ర వేసింది. బుధవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశమందిరంలో మేయర్ యాదగిరి సునీల్‌రావు అధ్యక్షతన ఉదయం 11 గంటలకు బడ్జెట్‌పై ప్రత్యేక సమావేశం, మధ్యాహ్నం 3 గంటలకు సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించాల్సి ఉండగా షరా మాములుగానే ఎజెండా అంశాలపై నామమాత్ర చర్చ జరిపి, తాగునీటి సమస్యతోపాటు పలు సమస్యలను ప్రస్తావించి ముచ్చటగా మూడున్నర గంటల్లోపే భోజన విరామం తీసుకోకుండా రెండు సమావేశాలను ఒకేసారి ముగించేశారు. బడ్జెట్‌లో రూపొందించిన ఆదాయ వ్యయాలపై చర్చించి సభ్యులు అడిగిన ప్రశ్నలకు మేయర్ సునీల్‌రావు సమాధానమివ్వడంతో ఆమోదం తెలిపారు. ఈ సందర్భంగా మాజీ మేయర్ సర్దార్ రవీందర్‌సింగ్ మాట్లాడుతూ బల్దియా బడ్జెట్ సమావేశానికి కలెక్టర్ ఎందుకు హాజరు కాలేదని, కలెక్టర్ హాజరు కానందున బడ్జెట్ మీటింగ్‌ను వాయిదావేయాలని కోరారు. దీనితో ఎలక్షన్ కమిషన్ సమావేశాల్లో కలెక్టర్ బిజీగా ఉన్నారని, అందుకు రాలేక పోవచ్చని మేయర్ సమాధానమిచ్చారు. ఇటీవల పలువురు బీఆర్ఎస్ కార్పొరేటర్లు అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్నందున కౌన్సిల్‌కు కలెక్టర్ రాక పోవచ్చని కార్పొరేటర్ పెద్దపల్లి జితేందర్ అభిప్రాయం వ్యక్తం చేశారు. అలాంటిదేమీ లేదని, కలెక్టర్‌కు సమాచారమిచ్చి సమావేశం ఏర్పాటు చేశామని మేయర్ సునీల్‌రావు, కమిషనర్ బోనగిరి శ్రీనివాస్ సమాధానమివ్వడంతో బడ్జెట్‌పై చర్చ కొనసాగించి ఆమోదం తెలిపారు.

అన్ని డివిజన్లకు సమానంగా మంచినీటిని సరఫరా చేయాలి

జీరో అవర్‌లో పాలకవర్గ సభ్యులు గంట కల్యాణి శ్రీనివాస్, బండారి వేణు, కంసాల శ్రీనివాస్, కుర్ర తిరుపతితోపాటు పలువురు కార్పొరేటర్లు గత కొంత కాలంగా నగరంలో మంచినీటి సరఫరా సరిగా జరుగడం లేదన్నారు. అన్ని డివిజన్లకు సమానంగా నీరు ఇవ్వకుండా వ్యత్యాసం చూపడంతో ప్రజలకు సమాధానం చెప్పుకోలేక పోతున్నామని ఆవేదన చెందారు. రానున్న వేసవి దృష్ట్యా సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. మేయర్ సునీల్‌రావు మాట్లాడుతూ గత నాలుగేళ్లుగా తమ పాలకవర్గం ఎక్కడా లేని విధంగా ప్రతిరోజు మంచినీటిని సరఫరా చేస్తున్నామని చెప్పారు. ప్రస్తుతం ఎల్ఎండిలో నీటి సామర్థ్యం తగ్గుతూ వస్తుందని, ప్రస్తుత 7.5 టీఎంసీలకు నీరు చేరడంతో గత రెండునెలలుగా బూస్టర్ పంపుసెట్లతో మంచినీటిని సరఫరా చేస్తున్నామని చెప్పారు. డ్యాంలో నీటి లభ్యత తక్కువ కావడంతో కొంత ఇబ్బంది జరుగుతుందని అన్నారు. ప్రజలకు ఎండాకాలంలో ఎలాంటి ఇబ్బంది లేకుండా తాగునీటిని అందించేందుకు ఎల్ఎండీలో 10 టీఎంసీల నీరు నిలువ ఉండేలా చూడాలని ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానం చేసి కలెక్టర్ ద్వారా పంపించాలని చేసిన ప్రతిపాదనకు సభ్యులు ఏకగ్రీవ ఆమోదం తెలిపారు.

ఆదాయవనరులను పెంచుకొని సుందరనగరంగా తీర్చిదిద్దుతాం: మేయర్

పన్నుల ద్వారావచ్చే ఆదాయవనరులను పెంచుకొని వాటి ద్వారా అభివృద్ధి కార్యక్రమాలను మరింత ముమ్మరంగా చేపట్టి సుందర నగరంగా తీర్చిదిద్దేందుకు కృషిచేస్తామని అన్నారు. నగర ప్రజలకు మెరుగైన వసతులను కల్పించడంతో పాటు సమస్యలన్నిటినీ దశలవారీగా పరిష్కరిస్తామని అన్నారు.

ద్వితీయ, తృతీయశ్రేణి పట్టణాలకు ఐటీ

- బహుళజాతి కంపెనీలతో సంప్రదింపులు చేస్తున్నాం
- రాష్ట్రంలో ఉన్న ఐటీ పార్కుల పనితీరును సమీక్షిస్తాం
- రాష్ట్ర ఐటీ శాఖమంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు



కరీంనగర్, మార్చి 6 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): ఐటీ పరిశ్రమను ద్వితీయ, తృతీయశ్రేణి నగరాలు, పట్టణాలకు విస్తరించే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని రాష్ట్ర ఐటీశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. బుధవారం ఆయన కరీంనగర్ ఆర్‌అండ్‌బీ వసతిగృహంలో విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఐటీ పార్కుల్లో ఉన్న కంపెనీలు, ఉపాధి అవకాశాలు, స్థల కేటాయింపులు, ఆయా కంపెనీల సమస్యలను తెలుసుకు నేందుకు సమీక్షా సమావేశాలు ఏర్పాటు చేస్తామని అన్నారు. ఐటీ పార్కుల్లో మరిన్ని కంపెనీలకు అవకాశం కల్పించి ఐటీ ఉద్యోగావకాశాలు మెరుగుపరుస్తామని అన్నారు. బహుళ జాతి కంపెనీలతో ప్రభుత్వం ఇప్పటికే సంప్రదింపులు ప్రారంభించిందని, ద్వితీయ, తృతీయశ్రేణి నగరాలకు ఐటీ రంగాలను విస్తరించడం ద్వారా రాష్ట్రంలో ఉపాధి అవకాశాలు మెరుగుపరుస్తామని అన్నారు. రాష్ట్రంలో స్కిల్ యూనివర్శిటీ నెలకొల్పాలని ప్రభుత్వం భావిస్తున్నదని అన్నారు. రాష్ట్రంలో నైపుణ్యం, ప్రావీణ్యత ఉన్న మానవవనరులను తయారు చేసే లక్ష్యంగా స్కిల్ యూనివర్శిటీ స్థాపించతలపెట్టామని అన్నారు. ఈ యూనివర్శిటీ ఏర్పాటు విషయంలో సలహాలు సూచనలు కోరుతున్నామని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. రాష్ట్రంలో ఏటా 10వేల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించే లక్ష్యంగా ఇంజనీరింగ్, బీకాం, బీఏ ఎకనామిక్స్ కోర్సుల విద్యార్థులకు ప్రత్యేకంగా మరో ఆరు నెలల కోర్సు నిర్వహించనున్నామని మంత్రి చెప్పారు. ఫైనాన్స్, బాంకింగ్, ఇన్సూరెన్సు సెక్టార్‌లో దేశంలోనే కాకుండా విదేశాల్లో కూడా ఉద్యోగావకాశాలున్నాయని, వాటిని రాష్ట్రంలోని నిరుద్యోగ యువత పొందేందుకు వీలుగా ఈ కోర్సు దోహదపడుతుందని శ్రీధర్‌బాబు అన్నారు. ఇందుకోసం విద్య, ఐటీ శాఖలు ఎంవోయు కుదుర్చుకోనున్నాయని అన్నారు. డిగ్రీ, ఇంజనీరింగ్, ఇతర ప్రొఫెషనల్ కోర్సుల్లో చివరి మూడు లేక ఆరు నెలల కాలంలో ఇంటర్న్‌షిప్ పెట్టాలని ప్రభుత్వం భావిస్తున్నదని మంత్రి చెప్పారు. విద్యార్థులలో పరిశ్రమల అనుభవం, పరిశోధన అనుభవాలను పెంపొందించి ఉద్యోగావకాశాలు మెరుగుపరిచేందుకు ఈ ఇంటర్న్‌షిప్ పనిచేస్తుందని అందుకే దీనిని పెట్టాలని భావిస్తున్నామని అన్నారు. ఆయా కోర్సుల్లో వారి చదువు పూర్తికాగానే ఉద్యోగావకాశాలు కూడా పెరుగుతాయని తద్వారా స్కిల్ ఉన్న మానవవనరుల కేంద్రంగా రాష్ట్రం మారుతుందని శ్రీధర్‌బాబు అన్నారు.

రైతులను ఆదుకునేందుకే పంటల బీమా

- తిమ్మాపూర్ రైతు వేదికలో 'రైతు నేస్తం' ప్రారంభం

తిమ్మాపూర్, మార్చి6: రైతులకు కష్టం వచ్చినా, నష్టం వచ్చినా రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని ముఖ్యమంత్రి రేవం త్‌రెడ్డి రైతులకు భరోసా ఇచ్చారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో 110 రైతు వేదికలకు వీడియో కాన్ఫరెన్స్ అనుసంధాన కార్యక్రమాన్ని హైదారబాద్ నుంచి సీఎం రేవంత్‌రెడ్డి వర్చువల్ ద్వారా రైతునేస్తం కార్యక్రమాన్ని ప్రారంభించారు. తిమ్మాపూ ర్ మండల కేంద్రంలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్ అను సంధాన కార్యక్రమంలో మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, కలెక్టర్ పమేలా సత్పతి పాల్గొని కార్యక్రమాన్ని వీక్షించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ ప్రభుత్వం నేరుగా రైతుల వద్దకే వెళ్లి పంటల సాగులో ఎదురవుతున్న ఇబ్బందులను తెలుసుకొని పరిష్కరించాలనే ఆలోచనతోనే రైతునేస్తం అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. వచ్చే వానకాలం నుంచి రాష్ట్రంలో సాగ య్యే పంటలకు బీమా వర్తింప చేస్తున్నామన్నారు. మేడ్చల్ నుంచి బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ రైతును రాజుగా చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు.



సీఎం ప్రసంగాన్ని వింటున్న కలెక్టర్, ఎమ్మెల్యే కవ్వంపల్లి

- శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి

తిమ్మాపూర్ మండల కేంద్రంలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమం అనంతరం మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడారు. రైతునేస్తం కార్యక్రమం ద్వారా రైతులు శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి వ్యవసాయ అధికారి శ్రీనివాస్, జిల్లా ఉద్యానవనాధికారి శ్రీనివాస్, తహసీల్దార్ కనకయ్య, ఎంపిడివో విజయ్‌కుమార్, వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలి : కలెక్టర్

కరీంనగర్ టౌన్, మార్చి 6: జిల్లాలో 18 ఏళ్లు పైబడిన వారందరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక కలెక్టరేట్ ఆడిటోరియంలో స్వీప్ కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులకు ఓటు హక్కుపై అవగాహన కల్పించే అంశంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల్లో మంచి పాలకులను ఎన్నుకునేలా తల్లిదండ్రులు, మిత్రులు, కుటుంబసభ్యులకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఎన్నికల విధానాలు తెలిసేలా ప్రత్యేక తరగతులు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఈవో సిహెచ్‌విఎస్ జనార్ధన్‌రావు, మెప్మా పీడీ రవీందర్, మైనింగ్ ఏడీ రామాచారి, కరీంనగర్ ఎంఈఓ మధుసూధనాచారిపాల్గొన్నారు.

తిమ్మాపూర్: భవిష్యత్తులో రానున్న పార్లమెంట్ ఎన్నికలలో 18సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. స్థానిక వాగేశ్వరి కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్‌లో జిల్లా నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో జిల్లా స్థాయి నైబర్ వుడ్ యూత్ పార్లమెంట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్.నాగార్జున, కరీంనగర్ నెహ్రూ యువ కేంద్రం డివైఓ ఎం.వెంకటరాంబాబు, తహసీల్దార్ కనకయ్య, వాగేశ్వరీ విద్యా సంస్థల జనరల్ సెక్రటరీ గంద్ర శ్రీనివాస్‌రెడ్డి, కళాశాల జాయింట్ సెక్రటరీ డి.శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతు వేదికలకు వీడియో కాన్ఫరెన్స్ అనుసంధానం

వేములవాడ రూరల్, మార్చి 6: రైతునేస్తం కార్యక్రమంలో భాగంగా హన్మాజిపేటలోని రైతు వేదికలో వీడియో కాన్ఫరెన్స్ అనుసంధానం బుధవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు వర్చువల్ విధానంలో ప్రారంభించారు. కార్యక్రమంలో జడ్పీ డిప్యూటీ సీఈవో గీత, ఎంపీడీవో శ్రీనివాస్, చందుర్తి, జడ్పీటీసీ నాగం కుమార్, మండల పశు సంవర్ధక అధికారులు, వ్యవసాయశాఖ అధికారులు పాల్గొన్నారు.

పద్మశాలీ సేవాసంఘం ఆధ్వర్యంలో నిరసన

కొడిమ్యాల, మార్చి 6 :మండల కేంద్రంలోని అంగడి బజారులో బుధవారం సిరిసిల్ల కాంగ్రెస్ నాయకుడు కెకె మహేందర్‌రెడ్డి పద్మశాలీలపై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు నిరసనగా ఆయన దిష్టి బొమ్మను కొడిమ్యాల పద్మశాలీ సేవా సంఘం ఆధ్వర్యంలో దహనం చేశారు. అనంతరం కొడిమ్యాల ఎస్సై సందీప్‌కు చర్యలు తీసుకోవాలని కోరుతూ ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు అంకం రాజేశం, సంఘం నాయకులు లక్ష్మన్, రాజుకుమార్, జనార్దన్, అశోక్, చిరంజీవి, యెస్వంత్, దేవెందర్, రాకేష్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

నరేంద్ర మోదీ సారథ్యంలో మహిళా సాధికారత

గొల్లపల్లి, మార్చి 6: కేంద్ర ప్రభుత్వం మహిళల అభివృద్ధికి కృషి చేస్తోందని, ప్రధాని నరేంద్ర మోదీ సారథ్యంలో వికసిత భారత్ మహిళా సాధికారత వైపు దూసుకెళ్తోందని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అనుమల్ల కృష్ణహరి పేర్కొన్నారు. బుధవారం గొల్లపల్లి ఆర్యవైశ్య సంఘం భవనంలో బీజేపీ ధర్మపురి అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ కస్తూరి సత్యం ఆధ్వర్యంలో నారీ శక్తివందన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి పీఎం నరేంద్ర మోదీ పశ్చిమ బెంగాల్ రాష్ట్రం నుంచి వర్చువల్ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. దేశ వ్యాప్తంగా ఉన్న అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలలో నారీ శక్తివందన్ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు కన్వీనర్ సత్యం తెలిపారు. ఈ సందర్భంగా మోదీ ప్రభుత్వం మహిళల అభివృద్ధికి కట్టుబడి ఉన్నదని, ఈ నేపథ్యంలో విజయం సాధిస్తుందని అన్నారు.

















వాడిపోతున్న పండ్ల తోటలు!

నల్లగొండ జిల్లాలో బత్తాయి, నిమ్మతోటలకు నీటిగండం.. అడుగంటిన భూగర్భ జలాలు

» పంట నష్టం రూ.180 కోట్ల దాకా

» సర్కారు చొరవ చూపాలని రైతుల వినతి

నల్లగొండ, మార్చి 6 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): నల్లగొండ జిల్లాలో పండ్లతోటల రైతులకు నీటిగండం వెంటాడుతోంది. భూగర్భజలాల నీటిమట్టాలు రోజురోజుకీ పడిపోతుండటంతో వాటి ఆధారంగా సాగు చేసిన బత్తాయి, నిమ్మతోటలకు తీవ్ర నీటికొరత ఏర్పడింది. కనగల్లు మండలం చర్లగౌరారం, గుర్రంపోడు మండలం పోచంపల్లి సహా జిల్లావ్యాప్తంగా సుమారు 60వేల ఎకరాల్లో బత్తాయి, మరో 12 వేల ఎకరాల్లో వేసిన నిమ్మతోటలు నీరందక వాడిపోతున్నాయి. తోటలను కాపాడుకోవాలనే ఆశతో రైతులు లెక్కకుమిక్కిలిగా బోరుబావులు తవ్వుతున్న పరిస్థితి జిల్లా వ్యాప్తంగా ఏర్పడింది. నాన్ ఆయకట్టు ప్రాంతాలైన నల్లగొండ, దేవరకొండ డివిజన్లతో పాటు, మిర్యాలగూడ డివిజన్‌లోని మెట్ట ప్రాంతాల్లో ఈ కరువు పరిస్థితి కనిపిస్తోంది. జిల్లాలోని మెట్ట ప్రాంతాల్లో దాదాపు 300 నుంచి 500 అడుగుల లోతువరకు బోర్లు తవ్వినా, నీరు కనిపించకపోవడంతో రైతాంగం నైరాశ్యంలో మునిగింది. పండ్ల తోటలను సంరక్షించుకునేందుకు రైతులు ఒక్కొక్కరు 10, 20 వరకు బోర్లు వేస్తూ ఆర్థికంగా మరింత దెబ్బతింటున్న పరిస్థితి నెలకొంది. ఇదే పరిస్థితి కొనసాగితే జిల్లావ్యాప్తంగా బత్తాయి, నిమ్మ రైతులు సుమారు రూ.180 నుంచి రూ. 200 కోట్ల వరకు నష్టపోవాల్సి వస్తుందని చెబుతున్నారు. చెట్లు కూడా ఎండిపోతే మరింత నష్టపోవాల్సి ఉంటుందని, 10, 15 ఏళ్ల పాటు చేసిన శ్రమంతా వృథా అవుతుందని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఈ పరిస్థితుల్లో ఏఎమ్మార్పీ, వరద కాల్వల ద్వారా వీలైనన్ని చెరువులను నీటితో నింపితే భూగర్భజలాలు అందుబాటులోకి వస్తాయని, తద్వారా పంట నష్టపోయినా.. తోటలైనా దక్కుతాయని, ఆ దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. సాగర్‌లో నిల్వలు లేనందున ఎగువన ఉన్న ఆల్మట్టి నుంచి నీటిని విడుదల చేయిస్తే ఆదుకున్నట్లవుతుందని, ఈ మేరకు ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని రైతులు కోరుతున్నారు.

పశువుల మేతగా వరి పొలం

కూసుమంచి: యాసంగిలో వరి సాగు చేయొద్దని అధికారులు సూచించినా చాలామంది రైతులు పాలేరు పాతకాల్వ ఆయకట్టులో వరిసాగు చేశారు. అయితే పంట చివరి దశకు వచ్చిన ప్రస్తుత సమయంలో నీరు అందకపోవడంతో వరిపొలాలు ఎండిపోతున్నాయి. ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం జక్కేపల్లి, పెరికశింగారంలో వరిపొలాలకు సాగునీరు అందకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయి. పాలేరు నుంచి నీరు విడుదల చేయాలని రైతులు మొన్నటిదాకా ఆందోళనలు చేశారు. అధికారులు స్పందించకపోవడంతో పాతకాల్వ పరిధిలో ఎండిపోతున్న వరి పొలాల్లో రైతులు తమ పశువులను మేపుతున్నారు.



నల్లగొండ జిల్లా చిన్నఅడిశర్లపల్లిలో బోరుబావి నీళ్లు తగ్గడంతో వచ్చే కొద్దినీటిని పైపుల ద్వారా బత్తాయి చెట్లకు పోస్తున్న రైతు కూరలింగయ్య

చెరువులు నింపే కార్యాచరణ చేపట్టాలి



నాకు ఆరెకరాల బత్తాయి తోట ఉంది. భూగర్భజలాలు అడుగంటడంతో గతంలో ఉన్న బోరుబావులు నీరు పోయడం లేదు. నీళ్లందక తోట వాడిపోతోంది. ఇటీవల మూడు బోర్లు వేయించాను. చివరి బోరు 500 ఫీట్లవరకు వేసినా చుక్కనీరు రాలేదు. తోట ఎండితే భారీగా నష్టపోవాల్సి వస్తుంది. ప్రభుత్వం తక్షణమే ఏఎమ్మార్పీ ద్వారా చెరువులు నింపేందుకు చర్యలు తీసుకోవాలి.

- పోలేని యాదయ్య, బత్తాయి రైతు, పోచంపల్లి, నల్లగొండ

నీళ్లు లేక నిమ్మతోట ఎండుతోంది



నాకు రెండు ఎకరాల నిమ్మతోట ఉంది. మరో నాలుగెకరాల్లో వరి కూడా వేశాం. గతంలో నాలుగు బోర్లుంటే ఎండిపోయాయి. ఇటీవల మళ్లీ నాలుగు బోర్లు వేసినా చుక్క నీరు పడలేదు. నిమ్మతోట ఎండిపోతే ఎకరాకు కనీసం లక్షవరకు నష్టపోవాల్సి వస్తుంది. ప్రభుత్వం ప్రత్యామ్నాయ చర్యలు తీసుకొని మమ్మల్ని ఆదుకోవాలి.

- సత్తిరెడ్డి, నిమ్మరైతు, చర్లగౌరారం, నల్లగొండ జిల్లా

నాలుగు పర్యాటక ప్రాజెక్టులకు


నేడు ప్రధాని శంకుస్థాపన

హైదరాబాద్/వికారాబాద్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): కేంద్ర పర్యాటక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో రూ.137.76 కోట్ల అంచనా వ్యయంతో రాష్ట్రంలో చేపట్టనున్న నాలుగు పర్యాటక ప్రాజెక్టులకు ప్రధాని నరేంద్ర మోదీ గురువారం మధ్యాహ్నం శంకుస్థాపన చేయనున్నారు. ఆలంపూర్‌లోని జోగులాంబ ఆలయం, భువనగిరి జిల్లాలోని భువనగిరి కోట, వికారాబాద్ జిల్లాలోని అనంతగిరి కొండలు, హైదరాబాద్‌లోని బల్కంపేట ఎల్లమ్మ ఆలయం వద్ద చేపట్టే వివిధ అభివృద్ధి పనులను మోదీ వర్చువల్‌గా ప్రారంభిస్తారు. స్వదేశీ దర్శన్, ప్రసాద్ పథకాల కింద దేశ వ్యాప్తంగా 52 పర్యాటక కేంద్రాలను ఎంపిక చేసిన కేంద్రం దాదాపు రూ.1325.76 కోట్ల వ్యయంతో ఆయా ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేపట్టనుంది. ఇందులో భాగంగా ఆలంపూర్‌లోని జోగులాంబ ఆలయం అభివృద్ధికి, వసతుల కల్పనకు ప్రసాద్ పథకం కింద రూ.38.90 కోట్లు కేటాయించింది. అలాగే, భువనగిరి కోట ప్రాంతంలో విశ్రాంతి భవనాలు, పార్కులు, హరితవనాల అభివృద్ధికి, కోటపైకి చేరుకునేందుకు రోప్‌వే నిర్మాణానికి తొలి దశలో రూ.56.81 కోట్లు కేటాయించింది. హైదరాబాద్‌లోని బల్కంపేట ఎల్లమ్మ ఆలయ ప్రాంతంలో భక్తులకు అవసరమైన సౌకర్యాలు కల్పనకు ప్రసాద్ పథకం కింద రూ.4.05 కోట్లు కేటాయించారు. తెలంగాణ ఊటీగా ఖ్యాతి పొందిన అనంతగిరి కొండలు, అక్కడి అటవీ ప్రాంతాల్లో వసతుల కల్పనకు రూ.38 కోట్లు కేటాయించారు. ఆయా పనులు గురువారం ప్రారంభం కానున్నాయి. అనంతగిరి కొండలను ఎకో టూరిజం హబ్‌గా తీర్చిదిద్దనున్నారు. ఇందులో భాగంగా మొత్తం రూ.98 కోట్లతో అభివృద్ధి పనులను నాలుగు ప్యాకేజీలుగా చేపట్టనున్నారు.

తాగునీటికి కష్టమే!

(మొదటి పేజీ తరువాయి)

హైదరాబాద్ తాగునీటి అవసరాలకే తరలించాలని మంత్రి పొన్నం తాజాగా అధికారులను ఆదేశించినా.. ఆ నీళ్లలో గరిష్ఠంగా ఏడు టీఎంసీల దాకానే వచ్చే అవకాశం ఉండటంతో పట్నంలో ఈ వేసవిలో తాగునీటికి కటకట తప్పదనే అంచనాలకు బలం చేకూరుతోంది. బుధవారం సచివాలయంలో జీహెచ్‌ఎంసీ, వాటర్‌బోర్డు తదితర విభాగాల అధికారులతో బీసీ సంక్షేమ శాఖ, హైదరాబాద్ జిల్లా ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ సమీక్ష నిర్వహించారు. హైదరాబాద్ పరిధిలో నీటి ఎద్దడి లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆయన ఆదేశించారు. కృష్ణా, గోదావరి బ్యారేజీల్లో ఉన్న నీటి మట్టాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ తదనుగుణంగా ఏర్పాట్లు చేయాలన్నారు. హైదరాబాద్ తాగునీటి అవసరాల కోసం ఎల్లంపల్లి నుంచి 10 టీఎంసీలు వినియోగించుకోవాలని సూచించారు. ఎల్లంపల్లి నీటిని గజ్వేల్, దుబ్బాక, సిద్దిపేటకు ఇవ్వకుండా హైదరాబాద్‌కు తరలిస్తున్నారనే ప్రచారంలో వాస్తవం లేదని చెప్పారు. నీటి సరఫరా, రంజాన్‌లో ఏర్పాట్లు, వర్షాకాలంలో ముంపు ముప్పు నివారణ చర్యలపై అధికారులతో చర్చించి పలు సూచనలు చేశారు. 2017 అనంతరం ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులు నెలకొన్నా, నగరంలో తాగునీటికి ఇబ్బందులు లేవని మంత్రికి అధికారులు వివరించారు. వేసవితో పాటు రంజాన్ మాసంలో అవసరాల కోసం నీటి ట్యాంకర్లు 24 గంటలు సరఫరా చేసేలా ఏర్పాట్లు చేసుకోవాలని, ఇందుకు ఆర్థిక ఇబ్బందులుంటే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని పొన్నం చెప్పారు. విద్యా సంవత్సరం ప్రారంభమయ్యేలోపు తాగునీరు, ఇతరత్రా వసతులకు సంబంధించిన చర్యలు చేపట్టాలన్నారు. గతంలో జరిగిన ఘటనలను దృష్టిలో ఉంచుకొని వర్షాకాలంలో ముంపు ముప్పు, ప్రాణ నష్టం లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. మ్యాన్ హోల్‌లు తెరిచి ఉంటే ప్రమాదకరం అని, అలాంటి చోట్ల సిబ్బంది పర్యవేక్షణ ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సచివాలయం ముందు భారీగా వరద నీరు నిలుస్తోందని అధికారులు చెప్పడంతో ఆర్ అండ్ బీ అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి చొరవ తీసుకుంటామని పేర్కొన్నారు. నగరంలో ట్రాఫిక్ సమస్యలు లేకుండా పోలీసులు సమన్వయం చేసుకోవాలని సూచించారు. ఎన్నికల కోడ్ రాక ముందే ప్రారంభించే పనులుంటే ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలని చెప్పారు.



ఎల్లంపల్లి ప్రాజెక్టు (ఫైల్)

ఎల్లంపల్లి నీరొచ్చినా దాహ'మే'!

శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు అడుగంటుతోంది. పదేళ్లుగా ఎప్పుడూ లేని విధంగా ఈ ఏడాది నీటి నిల్వలు భారీగా పడిపోయాయి. మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోవడంతో కాళేశ్వరం నుంచి నీటి లభ్యత కూడా లేకుండాపోయింది. ప్రాజెక్టుకు తక్షణ నీటి సరఫరాకు అనుగుణంగా ఉండే కడెం ప్రాజెక్టులో కూడా నీటి నిల్వలు అడుగంటాయి. మార్చి 2వ తేదీ లెక్కల ప్రకారం 10.48 టీఎంసీల నీరే ఉంది. ఇక 7.66 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యం కలిగిన కడెంలో ప్రస్తుతం 3.88టీఎంసీల నీరే ఉంది. ఇందులో డెడ్ స్టోరేజీ కింద 2.8 టీఎంసీలను మినహాయిస్తే ప్రాజెక్టు నుంచి ఒక టీఎంసీ మాత్రమే ఎల్లంపల్లికి తీసుకునే అవకాశం ఉంది. పైగా ఎల్లంపల్లి ప్రాజెక్టులో నాలుగు టీఎంసీల కన్నా ఎక్కువ ఉంటేనే హైదరాబాద్‌కు నీటిని సరఫరా చేసేలా పంప్‌హౌస్‌ను ఏర్పాటు చేశారు. అంటే ఎల్లంపల్లికి కడెం నుంచి ఓ టీఎంసీ నీరు విడుదల చేసినా గరిష్ఠంగా ఏడు టీఎంసీలనే హైదరాబాద్‌కు తరలించే అవకాశం ఉంటుంది. ఈ నీళ్ల మార్చి, ఏప్రిల్ మాసాల్లో హైదరాబాద్‌కు తాగు నీటి అవసరాలు తీరుతాయని.. మే, జూన్ నెలల్లో మాత్రం తాగునీటికి కటకట తప్పదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. నాగార్జున సాగర్‌లో కూడా 515 లెవల్ వరకు నీళ్లు ఉన్నాయి. ఈ నీళ్లు మరో 5 ఫీట్ల మేర పడిపోతే హైదరాబాద్‌కు నీటి సరఫరా తగ్గొచ్చని ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి

శ్రీరాంసాగరే దిక్కు

ఎండాకాలంలో హైదరాబాద్ తాగునీటి అవసరాల కోసం శ్రీరాంసాగరే ప్రత్యామ్నాయంగా కనిపిస్తోంది. శ్రీరాంసాగర్‌లో 40టీఎంల నీటి నిల్వలున్నాయి. ప్రధానంగా ఇక్కడి నీటిని సాగు అవసరాలకే వాడుతున్నారు. శ్రీరాంసాగర్ నుంచి ఎల్లంపల్లికి నీటిని విడుదల చేస్తే తాగునీటి గండం నుంచి గట్టెక్కొచ్చు. అయితే ఈ విషయంలో నీటిపారుదల శాఖ అధికారులు స్పందించకపోవడం హైదరాబాద్ వాటర్‌వర్క్స్ అధికారులను ఆందోళనకు గురిచేస్తోంది. సీఈలు, ఎస్‌ఈల స్థాయిల్లో చర్చకు పెట్టినా ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్‌లో చలనం లేకపోవడం కలవరపెడుతోంది.

కాలుష్య నియంత్రణ బోర్డులో

అవినీతి అధికారులు

» మండిపడిన హైకోర్టు

» సుమోటోగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి సూచన

హైదరాబాద్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు (టీపీసీబీ)లో అవినీతి అధికారులు ఉన్నారంటూ హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. పీసీబీని సంపూర్ణ ప్రక్షాళన చేసే దిశగా ఇలాంటి అధికారులపై సుమోటోగా చర్యలు చేపట్టాలని ప్రభుత్వానికి సూచించింది. రంగారెడ్డి జిల్లా గగన్‌పహాడ్‌లో ఉన్న ఫ్రోస్టర్స్ అనే కంపెనీకి జాయింట్ చీఫ్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ జారీచేసిన కంపెనీ మూసివేత నోటీసును హైకోర్టు కొట్టేసింది. వాటర్ (ప్రివెన్షన్ అండ్ కంట్రోల్ ఆఫ్ పొల్యూషన్) యాక్ట్ - 1988 ప్రకారం ఎందుకు చర్యలు తీసుకోరాదో వివరించాలని ఆ పీసీబీ అధికారి పిటిషనర్ కంపెనీకి షోకాజ్ నోటీసులు జారీచేశారు. చట్టంలోని నిబంధన ప్రకారం ప్లాస్టిక్ వాషింగ్ యూనిట్‌కు అనుమతి అవసరం లేదంటూ ఆ కంపెనీ సమాధానం ఇచ్చింది. కంపెనీ ఇచ్చిన వివరణను పట్టించుకోకుండా, తమ నోటీసులకు ఎలాంటి సమాధానం ఇవ్వలేదని పేర్కొంటూ అధికారి క్లోజర్ ఆదేశాలు జారీచేశారు. మూసివేత ఆదేశాలను సవాల్ చేస్తూ కంపెనీ హైకోర్టును ఆశ్రయించింది. ఈ పిటిషన్‌పై చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. ' రాష్ట్ర ప్రభుత్వ వ్యవహారాల్లో ఇదో బాధాకరమైన విషయం. పొల్యూషన్ కంట్రోల్ బోర్డులోని అవినీతి అధికారులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలి. పీసీబీ వ్యవస్థను పారదర్శకంగా మార్చాలి. గత ఏడునెలలుగా మేం పీసీబీ పనితీరును గమనిస్తున్నాం. కొంత మంది అధికారులు షోకాజ్ నోటీసులు ఇస్తారు.. మరి కొంత మంది అధికారులు వచ్చి ఎలాంటి సమాధానం రాలేదంటూ తుది ఆదేశాలు ఇస్తారు. సామర్థ్యం లేని అధికారులను మారుమూల ప్రాంతాలకు బదిలీ చేయాలి ' అని వ్యాఖ్యానించింది. సహజ న్యాయసూత్రాలకు విరుద్ధంగా జారీచేసిన మూసివేత ఉత్తర్వులు చెల్లవని పేర్కొంటూ వాటిని కొట్టేసింది. ఈ పనిని వేరే అధికారికి అప్పగించి.. 15 రోజుల్లో తాజా ఆదేశాలు జారీచేయాలని స్పష్టం చేసింది. 15 రోజుల్లో తాజా ఆదేశాలు ఇవ్వకపోతే కోర్టు ధిక్కరణ చర్యలు చేపడతామని స్పష్టం చేసింది.

ఎల్‌ఆర్‌ఎస్‌పై బీఆర్‌ఎస్ రాజకీయం!

» కేటీఆర్‌కు కోదండరెడ్డి ప్రశ్న

హైదరాబాద్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఎల్‌ఆర్‌ఎస్‌పై బీఆర్‌ఎస్ పార్టీ రాజకీయం చేస్తోందని... ఆ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు అక్రమ లే అవుట్లు వేస్తుంటే నిద్రపోయారా అని కిసాన్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు కోదండరెడ్డి ప్రశ్నించారు. ఎల్‌ఆర్‌ఎస్‌పై ఇచ్చిన రెండు జీవోలూ గత ప్రభుత్వం ఇచ్చినవేనని, కేటీఆర్ మంత్రిగా ఉన్నప్పుడు ఇచ్చిన ఆ జీవోల్లోనే ధరలూ నిర్ణయించారన్నారు. గాంధీ భవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కోదండరెడ్డి మాట్లాడుతూ అధికారంలో ఉన్నప్పుడు అమాయక ప్రజల నుంచి డబ్బులు లాక్కునే ప్రయత్నం చేసిన కేటీఆర్.. ఇప్పుడేమో ఉచితంగా రెగ్యులరైజ్ చేయాలంటూ చెబుతున్నారన్నారు. హౌసింగ్ బోర్డు ద్వారా పేదలకు ఇళ్లు ఇచ్చింది కాంగ్రెస్ పార్టీనే అన్నారు. కోకాపేటలో పేదలకు కాంగ్రెస్ ప్రభుత్వం భూమి ఇస్తే.. కేసీఆర్ వాటిని లాక్కుని బిల్డర్లకు ఇచ్చారన్నారు. ఔటర్ రింగ్ రోడ్డును ప్రైవేటు కంపెనీకి అప్పగించేశారన్నారు. జీవో 111 పరిధిలోని భూములనూ ఆక్రమించారన్నారు. వీటన్నిటిపైనా విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

బీఆర్‌ఎస్ బలహీనపడింది

» పొత్తులతో అది స్పష్టం: నిరంజన్

హైదరాబాద్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): బీఎస్పీతో పొత్తు పెట్టుకోవడం ద్వారా బీఆర్‌ఎస్ పార్టీ ఎంత బలహీనపడిందో స్పష్టమైందని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు నిరంజన్ అన్నారు. బీఆర్‌ఎస్ నేతలు ఆ పార్టీని వీడి వెళుతుండడంతో ఉనికిని కాపాడుకునేందుకు కేసీఆర్ నానా తంటాలు పడుతున్నారన్నారు. నిబద్ధత గల అధికారిగా పేరున్న ప్రవీణ్‌కుమార్‌కూ ఇది ఒక చెరగని మచ్చ అన్నారు. దళితుడిని తెలంగాణకు తొలి సీఎంగా చేస్తానని చెప్పి మాట తప్పినందుకు కేసీఆర్ పంచన చేరారా... అంటూ ప్రవీణ్‌కుమార్‌ను ప్రశ్నించారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డిని ఏక్‌నాథ్ షిండేగా పేర్కొంటున్న కేటీఆర్.. హింసించే రాజు 23వ పులకేశి అంటూ టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కైలాష్ నేత ధ్వజమెత్తారు. బీఆర్‌ఎస్‌ను కేసీఆర్ హోల్‌సేల్‌గా బీజేపీకి అమ్మకానికి పెట్టారన్నారు. ప్రవీణ్‌కుమార్‌ని పెంచి పోషించింది బీఆర్‌ఎస్ పార్టీనేనని, అది ఇప్పుడు బట్టబయలైందని అన్నారు. గాంధీభవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఈమేరకు మాట్లాడారు.

గాంధీభవన్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని గాంధీభవన్‌లో బుధవారం మహిళాకాంగ్రెస్ ఆధ్వర్యంలో వేడుక జరిగింది. మహిళా కాంగ్రెస్ నేతలు భారీ కేక్‌ను కట్ చేసి ఆనందాన్ని పంచుకున్నారు. ఈ వేడుకల్లో మంత్రి కొండా సురేఖ, మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు సునీతారావు, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి ఓటర్ల వివరాలు ఇవ్వండి

» ఎన్నికల అధికారులకు హైకోర్టు ఆదేశాలు

హైదరాబాద్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): చేవెళ్ల పార్లమెంటరీ నియోజకవర్గంలో పోలింగ్ స్టేషన్‌ల వారీగా ఇంటినంబర్లతో కూడిన మ్యాప్ (నజ్రీ నక్ష)లను మాజీ ఎంపీ, ఆ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి అందజేయాలని ఎన్నికల అధికారులకు హైకోర్టు ఆదేశాలు జారీచేసింది. చీఫ్ ఎలక్ట్రోరల్ ఆఫీసర్ గతేడాది జారీచేసిన స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ (ఎస్‌ఓపీ) ప్రకారం నజ్రీ నక్ష అందజేయాల్సి ఉండగా అందుకు ఎన్నికల అధికారులు నిరాకరిస్తున్నారని పేర్కొంటూ ఆయన హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది ఎల్. రవిచందర్ వాదనలు వినిపిస్తూ.. చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గంలో 2.40 లక్షల మంది నకిలీ ఓటర్లు ఉన్నారని.. హైదరాబాద్‌లో 1.65 లక్షల మంది వరకు ఉన్నారని ఆరోపించారు. ఎన్నికల అధికారులు ఇంటి నెంబర్లతో కూడిన నజ్రీ నక్షలను బయటపెట్టకపోవడం వల్ల ఓటర్ల జాబితాలో అక్రమాలకు అవకాశం ఏర్పడుతోందని పేర్కొన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం తరఫు సీనియర్ న్యాయవాది అవినాశ్ దేశాయి వాదనలు వినిపిస్తూ.. ఫొటోలతో కూడిన డ్రాఫ్ట్ ఓటర్ల జాబితా, ప్రతి పోలింగ్ స్టేషన్ పరిధిలోని ఏరియాను ప్రతిబింబించే నజ్రీ నక్షను ఆయా రాజకీయ పార్టీలకు ఎన్నికల అధికారులు అందజేస్తారని పేర్కొన్నారు. తగిన మొత్తంలో రుసుము చెల్లిస్తే పిటిషనర్‌కు నక్ష అందజేయడానికి అభ్యంతరం లేదని పేర్కొన్నారు. వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం.. ఖర్చులు స్వీకరించి పిటిషనర్ కోరిన విధంగా నజ్రీ నక్ష అందజేయాలని ఆదేశించింది.

సీడ్ కార్పొరేషన్‌లో సిత్రాలెన్నో!

(మొదటి పేజీ తరువాయి)

ఆర్భాటంగా ప్రకటించగా.. గడిచిన పదేళ్లలో విత్తనోత్పత్తి కాస్తా ఏటా నేలచూపులు చూస్తూ.. అథఃపాతాళానికి పడిపోయింది. విత్తనాల నాణ్యతను ధ్రువీకరించే 'సీడ్ సర్టిఫికేషన్ అథారిటీ'లోనూ అన్నీ అవకతవకలే.! ఇక్కడ సిబ్బంది బయోమెట్రిక్ ఉండదు. ఇద్దరు ఔట్‌సోర్సింగ్ సిబ్బంది అసలు విధుల్లోకే రారు. సంతకాలు చేయరు. తొమ్మిదేళ్లుగా జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ప్రిన్సిపల్ సైంటిస్ట్‌గా, సీడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ హెచ్‌వోడీగా, సీడ్ కార్పొరేషన్ ఎండీగా కె.కేశవులు పనిచేస్తున్నారు. ఈ తొమ్మిదేళ్లలో రికార్డు స్థాయిలో 28 విదేశీ పర్యటనలు చేశారు. ఏ ముఖ్యమంత్రి గానీ, మంత్రులు గానీ ఇన్ని విదేశీ పర్యటనలు చేయకపోవడం విశేషం. పైగా.. 2022 అక్టోబరులో నిర్వహించిన గ్రూప్-1 ప్రిలిమ్స్‌లో కె.కేశవులు స్వస్థలమేది? అంటూ ఓ ప్రశ్న రావడం గమనార్హం!

గ్రో ఔట్ టెస్ట్ నిధులెక్కడ?

విత్తనాభివృద్ధి కోసం గ్రో ఔట్ టెస్ట్(జీవోటీ) ఫామ్ కోసం కేంద్ర ప్రభుత్వం రూ.50 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం మరో రూ.50 లక్షలను మ్యాచింగ్ గ్రాంట్ కింద అందజేశాయి. రాజేంద్రనగర్‌లోని జయశంకర్ వర్సిటీ ప్రాంగణంలో ఈ ఫామ్ ఏర్పాటుకు ప్రతిపాదనలు చేశారు. ఇప్పుడు అక్కడ పాడుబడ్డ ఓ గేటు, చెట్ల పొదలు, ముళ్ల కంపలు తప్ప. అక్కడ ఫామ్ లేదు. అయితే.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలిచ్చిన రూ.కోటి నిధులు ఎక్కడ? అనేది ఇప్పుడు ప్రశ్నగా మారింది. ఒక్క విత్తన గింజను ఉత్పత్తిచేయకున్నా.. యూసీలు మాత్రం సమర్పించారు. తెలంగాణను 'సీడ్ బౌల్ ఆఫ్ ఇండియా'గా చేస్తామంటూ గత ప్రభుత్వం చేసిన ప్రకటన ఆర్భాటాలకే పరిమితమైంది. లక్షల నిధులు కేటాయించినా.. విత్తనోత్పత్తి పెరగకపోగా.. సీడ్ కార్పొరేషన్‌లో పదేళ్లుగా నేలచూపులు చూస్తోంది. ఎగుమతులు క్షీణించాయి. 2014-15లో సీడ్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో జరిగిన విత్తనోత్పత్తి 3.18 లక్షల క్వింటాళ్లు కాగా.. 2021-21లో 1.56 లక్షల క్వింటాళ్లు, 2022-23లో 1.78 లక్షల క్వింటాళ్లకు పడిపోయింది. విత్తన పంపిణీ 2014-15లో 3.36 లక్షల క్వింటాళ్లుగా ఉండగా.. 2022-23లో అది 3.05 లక్షల క్వింటాళ్లకు పడిపోయింది. సీడ్ సర్టిఫికేషన్ ఏజెన్సీలో రిజిస్ట్రేషన్లు కూడా గణనీయంగా పడిపోయాయి. 2015-16తో పోలిస్తే.. 2022-23కల్లా ఈ రిజిస్ట్రేషన్లు 1.65 లక్షల మేర తగ్గిపోయాయి.

ఇస్టా కాంగ్రెస్‌కు ఇష్టారాజ్యంగా నిధులు

హైదరాబాద్‌లో 2019 జూన్ నెలలో 32వ ఇస్టా కాంగ్రెస్ సదస్సును నిర్వహించారు. 75 దేశాల నుంచి 451 మంది ప్రతినిధులు ఈ సదస్సుకు హాజరైనట్లు ఇస్టా కాంగ్రెస్ నోడల్ ఆఫీసర్‌గా వ్యవహరించిన టీఎస్-ఎస్‌వోసీఏ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కె.కేశవులు అప్పట్లో వెల్లడించారు. ఈ సదస్సు నిర్వహణకు అప్పట్లో రైతుబంధు' నిధులను మళ్లించినట్లు ఫిర్యాదులు వచ్చాయి. సుమారు రూ.10 కోట్ల నిధులను ఇస్టా కాంగ్రెస్ సదస్సుకు ఖర్చు చేశారు. ఇందులో పెద్దమొత్తంలో నిధులు దుర్వినియోగమైనట్లు ఆరోపణలున్నాయి. మూడు రోజులకు నోవాటెల్ హోటల్ హాలు, భోజనాలకే రూ.70 లక్షల ఖర్చు రాశారు. డెలిగేట్స్ గదులకు రూ.25 లక్షలు, స్టాల్స్ ఏర్పాటుకు రూ.43.12 లక్షలు, కార్నివాల్ ఏర్పాట్లకు రూ.20.37 లక్షలు, తాజ్ హోటల్స్‌లో ఫుడ్ అండ్ బేవరేజెస్‌కు రూ.26.34 లక్షలు, సాంస్కృతిక కార్యక్రమాలకు రూ.25.65 లక్షలు, ప్రచారానికి రూ.12 లక్షలు, హైటెక్స్‌లో స్టేజీ ఇతరత్రా ఏర్పాట్లకు రూ.20 లక్షలు, ఇస్టా వీడియో ఫిల్మ్‌లకు రూ.18 లక్షలు, ఎగ్జిబిటర్లు, అధికారుల ఫీజులకు రూ.52.75 లక్షలు, రైతుల సమావేశానికి రూ.56 లక్షలు, చిల్లర ఖర్చులకు రూ.15 లక్షలు వెచ్చించారు. చివరకు నోడల్ ఆఫీసర్ కేశవులు ఐ-ఫోన్ కోసం రూ.65 వేలను ఈ నిధుల్లోంచే ఖర్చుచేశారు. హైదరాబాద్‌లోని పలు స్టార్‌హోటళ్ల పేరుతో విచ్చలవిడిగా బిల్లులను సమర్పించారు. దీనిపై అప్పట్లో విమర్శలు వచ్చినా.. నాటి ప్రభుత్వం పట్టించుకోలేదు.

ప్రైవేటు ఏజెన్సీలతోనే ఆడిటింగ్

తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ, విత్తన ధ్రువీకరణ సంస్థకు సంబంధించిన ఆడిట్‌ను ఏటా ప్రైవేటు ఏజెన్సీలతోనే చేయించారు. ఒక 2021-22లో మాత్రమే ఏజీ ఆడిట్ జరిగింది. ఆర్‌కేవీవై పథకంలో వరంగల్‌లో ఆఫీస్ బిల్డింగ్ పూర్తిగా నిర్మించకుండానే రూ.95 లక్షలకు యూసీలు సమర్పించినట్లు తెలుస్తోంది. మినీ బస్ కొనుగోలు, సబ్-మిషన్ ఆఫ్ సీడ్స్ అండ్ ప్లాంటింగ్ మెటీరియల్ నిధుల మళ్లింపు, వాహనాల నిర్వహణ, వ్యవసాయశాఖ కార్యదర్శి కార్యాలయంలో పనిచేసే టెక్నికల్ సిబ్బందికి వేతన చెల్లింపులు, ఈపీఎఫ్-ఈఎస్‌ఐ కాంట్రిబ్యూషన్, కాకాని కన్సల్టెన్సీకి చేసిన చెల్లింపులు, ఫిక్స్‌డ్ డిపాజిట్లు, సీడ్ టెస్టింగ్ ల్యాబ్ పేరుతో ఆర్‌కేవీవై నిధుల మళ్లింపులో జరిగిన అవకతవకలు ఏజీ ఆడిట్‌లో వెలుగుచూశాయి. మిగిలిన సంవత్సరాల్లో చిట్టిబాబు అండ్ కంపెనీ, సుబ్రమణ్యం అండ్ కంపెనీ అనే ఏజెన్సీలతో ఆడిట్ చేయించారు. అక్రమాలను కప్పి పుచ్చుకునేందుకే ప్రైవేటు ఏజెన్సీలతో ఆడిట్ చేయించినట్లు ఆరోపణలున్నాయి.

జీతం ఇక్కడ.. చేసేది ఆర్డర్లీ

సీడ్ సర్టిఫికేషన్‌లో ఉద్యోగంలో చేరిన ఇద్దరు ఔట్ సోర్సింగ్ సిబ్బంది.. విధులకు హాజరవ్వడం లేదు. బయోమెట్రిక్ వేయటం లేదు. ఒకరేమో హైదరాబాద్ లంగర్‌హౌస్‌లో నివాసముంటున్న ఏపీ మాజీ సీఎస్ ఇంట్లో పనిచేస్తున్నారు. మరొకరు ఆ మాజీ ఐఏఎస్ ఇంటిపక్కనే ఉండే సీడ్ కార్పొరేషన్ ఎండీ ఇంట్లో ఊడిగం చేస్తున్నట్లు సమాచారం. ఈ ఇద్దరు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఏడాదికోసారి తెల్లకాతాలపై సంతకాలు చేసి పంపుతున్నట్లు.. దాన్నే రెన్యూవల్ ఆఫ్ సర్వీసెస్‌గా అధికారులు రికార్డుల్లో పెడుతున్నట్లు తెలుస్తోంది.

అపార్ట్‌మెంట్ పై నుంచి పడి వ్యక్తి మృతి

కరీంనగర్ క్రైం, మార్చి 6: నగరంలోని రేకుర్తి సుచిత్ర అపార్ట్‌మెంట్ పైనుంచి ప్రమాదవశాత్తు కింద పడి కామారపురమేష్ (56) అనే వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అపార్ట్‌మెంట్‌లోని ఐదో అంతస్తులో కుటుంబంతో కలిసి ఉంటున్నాడు. రమేష్‌కు కళ్లు సరిగా కనిపించని కారణంగా ప్రమాదవశాత్తు కాలుజారి కిందపడి పోవడంతో తలకు తీవ్ర గాయాలై మృతి చెందినట్లు మృతుడి కుమారుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

వైభవంగా ఏకాదశి ఉత్సవం



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

కరీంనగర్ కల్చరల్, మార్చి 6: నగరంలోని తిరుమలనగర్ శ్రీనిలయంలో మాఘ బహుళ ఏకాదశి ఉత్సవం సందర్భంగా బుధవారం సామూహిక విష్ణుసహస్రనామ పారాయణం, అష్టాక్షరి మూలమంత్ర సహిత లక్ష్మీనారాయణ హవనం వైభవంగా జరిగింది. మయూరగిరి పీఠాధిపతి నమిలకొండ రమణాచార్య స్వామి నేతృత్వంలో ఉదయం అభిషేక, అర్చనలు, హవనం జరిగాయి. కార్యక్రమంలో రామకృష్ణమాచార్యులు, గీతాచార్యులు, శ్రీనాథాచార్యులు, రమేశ్‌స్వామి, శ్రీరామ సేవా తరంగిణి నిర్వాహకులు, వివిధ ప్రాంతాల భక్తులు పాల్గొన్నారు.

'కుల గణన చేపట్టాలి'

సుభాష్‌నగర్, మార్చి 6: కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీలో ప్రకటించిన విధంగా కచ్చితమైన విది విధాలలను ఖరారు చేస్తూ కుల గణన చేపట్టాలని బహుజన సమాజ్‌పార్టీ రాష్ట్ర కార్యదర్శి రంగు సంపత్ అన్నారు. బుధవారం నగరంలోని ప్రెస్‌భవనలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికలే లక్ష్యంగా బీసీల ఓట్లు దండుకోవడానికే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్‌లు బీసీలను మోసం చేస్తున్నారని ఆరోపించారు. ఇది కేవలం ఎన్నికల స్టంట్‌గానే చూస్తున్నారని అన్నారు. ఏనాడూ బీసీ ఉద్యమంలో పాల్గొనని పొన్నం ప్రభాకర్ గతంలో పార్లమెంట్‌లో బీసీ కుల గణనపై నోరు మెదపలేదన్నారు. ఇప్పటికైనా బీసీ కుల గణనపై స్పష్టమైన వైఖరిని బయటపెట్టాలని డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షుడు మేకల రవీందర్ మాట్లాడుతూ వీపీ సింగ్ నేతృత్వంలో కాన్షిరామ్ బీసీ రిజర్వేషన్ కోసం 42 రోజులు దీక్ష చేస్తే, ఎల్‌కె అద్వాని కమండలం యాత్ర పేరుతో దానిని అడ్డుకున్నారని ఆరోపించారు. ప్రస్తుతం అమలవుతున్న 27 శాతం రిజర్వేషన్ కాన్షిరాం సాధించినదేనని అన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర కమిటి సభ్యుడు నల్లాల శ్రీనివాస్, రాష్ట్ర నార్త్ జోన్ మహిళ కన్వీనర్ జన్ను స్వరూప, జిల్లా ఇంచార్జీ మంద బాలయ్య, ప్రధానకార్యదర్శి మాంగాళి తిరుపతి, గాలి అనీల్‌కుమార్, షెనాయ్, బోనగిరి ప్రభాకర్, బానుచందర్ తదితరులు పాల్గొన్నారు.

మృతుడి గుర్తింపు

కరీంనగర్ క్రైం, మార్చి6: గత సంవత్సరం డిసెంబర్ 3న చింతకుంట శివారులోని మానేరు జలాశయంలో లభించిన మృత దేహాన్ని బుధవారం కుటుంబ సభ్యులు గుర్తించారని కొత్తపల్లి పోలీసులు తెలిపారు.గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం వివరాలు, ఫోటోలను కొత్తపల్లి పోలీసులు పోలీస్ శాఖకు చెందిన దర్పన్ యాప్‌లో అప్‌లోడ్ చేశారు. అప్పటికే మృతుడి బంధువులు నాగోల్ పోలీస్ ఠాణాలో మాన్‌మిస్సింగ్ కేసు నమోదు చేయిం చడం వలన మృతుని సంబంధించిన ఆనవాళ్లు సరిపోవటంతో బుధవారం మృతుని బంధువులు కొత్తపల్లి పోలీసు ఠాణాకు వచ్చారు. మృతునికి సంబంధించిన బట్టలు, వస్తువులు, బంగారు ఉంగరం, గుర్తుపట్టారు. మృతుడు జగిత్యాలకు చెందిన హర్కాల గోపికృష్ణ(49)గా నిర్ధారించారు. అతను ఉద్యోగరీత్యా హైదరా బాద్‌లోని నాగోల్‌లో స్థిరపడ్డాడు. హైదరాబాద్‌లో ఎకనామికల్ స్టాటికల్ డిపార్మెంట్‌లో పనిచేస్తూ సూపరిండెంట్‌గా పదోన్నతి పొందిన తర్వాత ఆంధ్ర రాష్ట్రానికి కేటాయించబడగా అక్కడ విజయవాడ గొల్లపూడిలో ఉద్యోగం చేస్తున్నాడు. అయితే తను పుట్టింది తెలంగాణలో ఆయినప్పటికీ ఆంధ్ర రాష్ట్రానికి కేటా యించబడ్డాననే బాధతో మనస్థాపం చెంది, ఆందోళనకు గురి అవుతూ మానసిక సమస్యలతో చికిత్స పొందుతూ, 2023 డిసెంబరు 2న తన ఇంటి నుండి కరీంనగర్‌కు మార్గమధ్యలో మానేరు జలాశయంలో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లుగా భావిస్తున్నారు.

లయన్స్‌క్లబ్ కార్యవర్గం

సుభాష్‌నగర్, మార్చి 6: నగరంలోని శ్రీరాజరాజేశ్వరీ లయన్స్‌క్లబ్ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బుధవారం అధ్యక్షురాలు బి.సరళ అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశంలో అధ్యక్షులుగా ఎ.శశికళ, కార్యదర్శిగా నరహరి లక్ష్మారెడ్డి, కోశాధికారిగా చందుపట్ల ఉమలను ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి, సీనియర్ క్లబ్ మెంబర్ రాళ్ళబండి శంకర్ ప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆర్‌సీ, లక్ష్మయ్య, జెడ్‌సి సంపత్‌కుమారి హాజరయ్యారు.

ఆలయాల అభివృద్ధికి కృషి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

తిమ్మాపూర్, మార్చి 6: ఆలయాల అభివృద్ధికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మండలంలోని నల్లగొండ సీతారామచంద్రస్వామి సహిత లక్ష్మీనరసింహ స్వామి ఆలయ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారోత్సవం కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ధర్మాన్ని మనం కాపాడితే అది మనల్ని కాపాడుతుందన్నారు. ఆలయాల అభివృద్ధికి పాలకవర్గంతో పాటు ప్రతిఒక్కరూ కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మోరపల్లి రమణారెడ్డి, ఆలయ చైర్మన్ బి లక్ష్మణ్, మాజీ చైర్మన్ శ్రీనివాసరావు, ఎంపీటీసీ బండారి రమేష్ పాల్గొన్నారు.

కెనాల్ నీటిలో మునిగి వృద్ధుడి మృతి

వీణవంక, మార్చి 6: మండలంలోని శ్రీరాములపేట గ్రామానికి చెందిన కట్కూరి నారాయణరెడ్డి (73)ఎస్సారెస్పీ ఉప కాలువ నీటిలో ప్రమాదవశాత్తు మునిగి మృతి చెందాడు. పోలీసులు కథనం ప్రకారం.. గ్రామంలోంని వ్యవసాయ భూములకు నీరు వెళ్లే కాలువలో గడ్డిపొరక, రాళ్లు పేరుకుపోవడం తో వాటిని తొలగించేందుకు కుర్మిండ్ల అశోక్, కాంతాల తిరుపతిరెడ్డి, కొండల్ రెడ్డితో పాటు నారాయణరెడ్డి వెళ్లగా కాలువలో దిగిన నారాయణరెడ్డికి ముళ్లపొరక తగలడంతో ప్రమాదవశాత్తు నీటిలో మునిగాడు. దీంతో వారు గమనించి బయటకు తీశారు. వెంటనే చికిత్స నిమిత్తం జమ్మికుంట అసుపత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. మృతుడి కూమారుడు శ్రీధర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వంశీకృష్ణ తెలిపారు.

మహిళల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కృషి

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి

హుజూరాబాద్, మార్చి 6: ఐదేళ్లలో మహిళల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం కృషి చేసిందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి అన్నారు. బుధవారం హుజూరాబాద్ పట్టణంలోని ఓ కన్వెన్షన్ హాల్‌లో శక్తి వందన్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా వీవో, సీఆర్పీ, స్వయం సహాయక బృందాల సభ్యులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మహిళ అభివృద్ధి, సంక్షేమం కోసం అనేక పథకాలు ప్రవేశపెట్టిందన్నారు. సమావేశంలో మాడ గౌతమ్‌రెడ్డి, ఎర్రబెల్లి సంపత్‌రావు, గంగిశెట్టి రాజు, రాముల కుమార్, వొడ్నాల విజయ్, సుమన్, మల్లేష్, తిరుపతిరెడ్డి, అశోక్‌రెడ్డి, భూపతి పాల్గొన్నారు.

ఎల్లమ్మ పట్నాలకు హాజరైన ఎమ్మెల్యే సత్యం

గంగాధర, మార్చి 6: గంగాధర మండలం బూరుగుపల్లిలో బుధవారం జరిగిన ఎల్లమ్మ పట్నాలకు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పాల్గొన్నారు. రేణుక ఎల్లమ్మకు మొక్కులు చెల్లించారు. కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

తెలంగాణ గౌడ సంఘం రాష్ట్ర కార్యదర్శిగా మహేందర్

హుజూరాబాద్ రూరల్, మార్చి 6: మండలంలోని చెల్పూర్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ నేరేళ్ల మహేందర్‌గౌడ్‌ను తెలంగాణ రాష్ట్ర గౌడ సంఘం రాష్ట్ర కార్యదర్శిగా నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు బొనగాని యాదగిరిగౌడ్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. తన నియామకానికి సహకరించిన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తీగల భరత్‌గౌడ్ తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు.

సమాజంలో మహిళల పాత్ర కీలకం

-జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రతిమ -పలు సంస్థల ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం



మహిళలకు బహుమతి ప్రదానం చేస్తున్న జిల్లా జడ్జి ప్రతిమ

సుభాష్‌నగర్, మార్చి 6: సమాజంలో మహిళలది కీలక పాత్ర అని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రతిమ,కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. బుధవారం నగరంలోని టీఎన్‌జీవో ఫంక్షన్‌హాలులో టీఎన్‌జీవో యూనియన్ ఆధ్వర్యంలో ముందస్తు అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళ ఉద్యోగులకు ఆటల పోటీలు, వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, మార్కెటింగ్ అధికారి పద్మావతి, ఆడిట్ ఆఫీసర్ రజిత, కమర్షియల్ ఆఫీసర్ సునీత, టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి సంగెం లక్ష్మణరావు, నాగుల నర్సింహస్వామి, రాజేశ్‌భరద్వాజ్, మహిళ జేఏసీ చైర్మెన్ ఇరుమల్ల శారద, సునీత, సబిత, విజయలక్ష్మి, హరి ప్రియ, సరిత, లలిత, మేరి, రాధిక, సుమలత, శైలజ, లక్ష్మి, పద్మ, రాగి శ్రీనివాస్, కిరణ్‌కుమార్, కిషన్, రవీందర్‌రెడ్డి, జలాలుద్దీర్‌అక్బర్, కరుణాకర్, కిషన్, రాజేశ్వర్‌రావు, నర్సయ్య, కొండయ్యనగేష్ పాల్గొన్నారు.

●**కరీంనగర్ టౌన్:** జడ్పీ సమావేశ మందిరంలో ఆదరణ సేవా సమితి అధ్యక్షురాలు కర్రె పావని ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. జడ్పీ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ ముఖ్యఅతిథిగా హాజరై డాక్టర్ బోయినపల్లి మాధవి, ఫుడ్ కమిషన్ సభ్యురాలు భారతి, జిల్లా సఖి సెంటర్ నిర్వాహకురాలు లక్ష్మి, గాయని ఒల్లాల వాణి, ఆర్‌వికె సంస్థ అధ్యక్షురాలు రుద్ర రాధ, డీఈ మమత కలిసి కేక్ కట్ చేసి సంబురాలను ప్రారంభించారు.

● వైశ్యభవన్‌లో వేడుకలు

గాంధీరోడ్‌లోని వైశ్యభవన్‌లో వైశ్య సేవా కేంద్రం ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సంప్రదాయ చీరకట్టులో ఫ్యాషన్ షో నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. తంబోలా ఆటలు, పాటలు వంటి కార్యక్రమాలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో వైశ్య సేవా కేంద్రం అధ్యక్షుడు చిదుర సురేశ్, ప్రధాన కార్యదర్శి పెద్ది విద్యాసాగర్, కోశాధికారి ముస్త్యాల రమేశ్, సాంస్కృతిక, ఆధ్యాత్మిక కో ఆర్డినేటర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

●**భగత్‌నగర్:** పురుషులకు దీటుగా మహిళా కండక్టర్లు సంస్థ అభివృద్ధికి దోహదం చేస్తున్నారని జిల్లా వినియోదారుల ఫోరం అధ్యక్షురాలు కె స్వరూపారాణి అన్నారు. బుధవారం కరీంనగర్-1 డిపోలో ముందస్తు మహిళా దినోత్సవాన్ని ఆర్ఎం సుచరితతో కలిసి ప్రారంభించారు. కరీంనగర్-2 డిపోలో జరిగిన కార్యక్రమంలో ఆర్టీసీ సీనియర్ మెడికల్ ఆఫీసర్ మంజుల, ఆర్ఎం ఎన్ సుచరితతో కలిసి వేడుకలను ప్రారంభించారు. కార్యక్రమంలో డిప్యూటి రీజినల్ మేనేజర్ సత్యనారాయణ, అసిస్టెంట్ మేనేజర్ జ్యోత్స్న, డిపో మేనేజర్లు విమలయ్య, ఎల్ మల్లేశం పాల్గొన్నారు.

●మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని భారత జాతీయ మహిళా సమాఖ్య (ఎన్ఎఫ్ఐడబ్ల్యు) జిల్లా అధ్యక్షురాలు కిన్నెర మల్లవ్వ అన్నారు. గురువారం నగరలోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో ముందస్తు అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో సీనియర్ రాష్ట్ర నాయకురాలు గూడెం లక్ష్మి, జిల్లా సహాయకార్యదర్శి కొట్టెఅంజలి, పోతుగంటి శారద, కొత్తూరి ధనలక్ష్మి, ఎలిశెట్టిశారద, బేబి, శ్రీలత, తదితరులు పాల్గొన్నారు.

●**కరీంనగర్ రూరల్:** తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాల నగునూరులో మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కరీంనగర్ మెప్మా డిప్యూటి డైరెక్టర్ పద్మావతి, ప్రిన్సిపాల్ సమత, వైస్ ప్రిన్సిపాల్ సుష్మ పాల్గొన్నారు.

●**సైదాపూర్:** మండల కేంద్రంలో వెన్నెల మహిళ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు ర్యాలీ తీశారు. ఈసందర్భంగా వక్తలు మాట్లాడుతూ మహిళలు తలుచుకుంటే ఏదైనా సాధించగలరన్నారు. కార్యక్రమంలో మండల కోర్డినేటర్ వెన్నెల, డిస్టిక్ కోఆర్డీనేటర్ స్వాతి, వెన్నెల మహిళా ఫెడరేషన్ అధ్యక్షురాలు భారతి, ఉపాధ్యక్షురాలు రజినీ పాల్గొన్నారు.

'కిమ్స్'లో క్రీడా ఉత్సవాలు ప్రారంభం

కరీంనగర్ స్పోర్ట్స్, మార్చి 6: కిమ్స్ విద్యాసంస్థల క్రీడోత్సవాలు బుధవారం జిల్లా కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్టేడియంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. రెండు రోజులపాటు నిర్వహించనున్న ఈ క్రీడలను కిమ్స్ విద్యాసంస్థల వైస్ చైర్మెన్ పేర్యాల సాకెత్‌రామారావు జెండా ఊపి, క్రికెట్ ఆడి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలతో స్నేహ సంబంధాలు పెంపొందుతాయని పేర్కొన్నారు. పురుషుల విభాగంలో నిర్వహించిన క్రికెట్ పోటీలకు 12 జట్లు, మహిళల విభాగంలో నిర్వహించన కబడ్డీ పోటీలకు 10 జట్లు, ఖోఖో పోటీలకు 10 జట్లు హాజరై ప్రతిభ చాటారు. ఈ పోటీల ఫైనల్స్‌ను ముగింపు సమావేశాన్ని గురువారం నిర్వహించనున్నారు. కార్యక్రమంలో కిమ్స్ డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ అర్జున్‌రావు, హోటల్ మేనేజ్‌మెంట్ ప్రిన్సిపాల్ అనూష్ రెడ్డి, లా కళాశాల ప్రిన్సిపాల్ నవీన్, ఎంబిఏ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కృష్ణమోహన్, బీఎడ్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఆదినారాయణ, సతీష్, సంపత్‌కుమార్, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

15 నుంచి పీజీ సప్లిమెంటరీ పరీక్షలు

గణేశ్‌నగర్, మార్చి 6: ఎస్‌యూ పరిధిలో ఎంఎస్సీ గణితం మొదటి సెమిస్టర్ మరియు మూడో సెమిస్టర్ సప్లిమెంటరీ పరీక్షలు 15వ తేదీ నుంచి ప్రారంభం కానున్నట్లు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎన్‌వీ శ్రీరంగప్రసాద్ తెలిపారు. మొదటి సెమిస్టర్ పరీక్షలు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరుగుతాయన్నారు. మూడో సెమిస్టర్ పరీక్షలు మధ్యాహ్నం 2గంగల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

బాధిత కుటుంబానికి చేయూత

కరీంనగర్ టౌన్, మార్చి 6: జిల్లా కేంద్రంలోని కిసాన్‌నగర్‌లో ఇటీవల భర్త చనిపోయిన నిరుపేద మహిళ రంగు శంకరమ్మకు డివిజన్ ప్రజలు చేయూతనందించారు. డివిజన్ ప్రజలు ఆమెకు ఆర్థిక సహాయం అందించి అండగా నిలవాలని కార్పొరేటర్ కంసాల శ్రీనివాస్ సోషల్ మీడియా ద్వారా విజ్ఞప్తి చేశారు. ఆయన స్వయంగా కొంత ఆర్థిక సహాయాన్ని అందించారు. ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి 15వేల రూపాయల మేరకు శంకరమ్మకు గూగుల్‌పే, ఫోన్‌పే చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సుల్తానా, వెంకటమ్మ గాజా, దేవయ్య, జమాన్ భాస్కర్ పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షల్లో ఒకరు డీబార్

కరీంనగర్ టౌన్, మార్చి 6: ఇంటర్మీడియట్ ఫస్ట్ ఇయర్ పరీక్షల్లో ఒక విద్యార్థి కాపీయింగ్ చేయడంతో డీబార్ చేశారు. బుధవారం ఫస్ట్ ఇయర్ మ్యాథమెటిక్స్-1బి, జువాలజీ, హిస్టరీ పరీక్షలు నిర్వహించగా 480 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. జనరల్ విభాగంలో 14,135 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 284 గైర్హాజరు కాగా 31,851 మంది హాజరయ్యారు. ఒకేషనల్ విభాగంలో 1723 మంది విద్యార్థులకు 196 మంది పరీక్షలకు హాజరుకాలేదని, 1527 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. జిల్లాలో జనరల్, ఒకేషనల్ కలిపి 15,858 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా 480 మంది గైర్హాజరు కాగా 15,378 మంది పరీక్షలు రాసినట్లు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి జగన్మోహన్‌రెడ్డి తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఎస్ఆర్ జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రంలో ఒక విద్యార్థి కాపీయింగ్ చేస్తుండగా డీబార్ చేసినట్లు తెలిపారు. జిల్లాలో విద్యార్థులు ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేశామని అన్నారు. పరీక్ష సమయంలో పరీక్షా కేంద్రం సూపరింటెండెంట్స్, డిపార్టుమెంటల్ అధికారులతో పాటు సిట్టింగ్, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు ఆకస్మిక తనిఖీలు నిర్వహిసున్నాయని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి చెప్పారు.

'క్రీడల్లో శాతవాహన విద్యార్థుల ప్రతిభ'



మాట్లాడుతున్న శాతవాహన వీసీ మల్లేశ్

కరీంనగర్ స్పోర్ట్స్, మార్చి6: అంతర యూనివర్సిటీ క్రీడల్లో శాతవాహన యూని వర్సిటీ జట్లు విశేష ప్రతిభ చాటాయని శాతవాహన యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ మల్లేశ్ అన్నారు. బుధవారం శాతవాహన స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో యూనివర్సిటీ ఆడిటోరియంలో వివిధ క్రీడా జట్లకు కోచ్ మేనేజర్లుగా వ్యవహరించిన వారిని, ఫిజికల్ డైరెక్టర్లను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కోచ్ మేనేజర్లు, ఫిజికల్ డైరెక్టర్ల కృషితోనే యూనివర్సిటీ జట్లు రాణిస్తున్నాయన్నారు. యూనివర్సిటీ పరిధిలో క్రీడలను క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నామన్నారు. క్రీడలతో శారీరక, మానసిక అభివృద్ధి జరుగుతుందని పేర్కొన్నారు. సన్మాన గ్రహీతలను ఈసందర్భంగా అభినం దించారు. అనంతరం వివిధ డిగ్రీ కళాశాలల, ఉన్నత పాఠశాలలకు చెందిన 30 మంది ఫిజికల్ డైరెక్టర్లను ఆయన సన్మానించారు. కార్యక్రమంలో యూనివర్సిటీ స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి నిజామోద్దీన్‌మునవ్వర్, ఫిజికల్ డైరెక్టర్లు విజయ్‌కుమార్, నాగేశ్వర్‌రావు, శ్రీధర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఫీజు లేకుండా ఎల్‌ఆర్‌ఎస్‌ను అమలు చేయాలి



మానకొండూర్‌లో మాట్లాడుతున్న రసమయి బాలకిషన్, చొప్పదండిలో ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

చొప్పదండి/మానకొండూర్ మార్చి 6: ఎలాంటి ఫీజు లేకుండా ఎల్‌ఆర్‌ఎస్‌ను అమలు చేయాలని మాజీ ఎమ్మెల్యేలు సుంకె రవిశంకర్, రసమయి బాలకిషన్ అన్నారు. బుధవారం చొప్పదండి, మానకొండూర్‌లో ఎల్‌ఆర్‌ఎస్‌కు వ్యతిరేకంగా ధర్నా నిర్వహించి తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సుంకె రవిశంకర్, రసమయి బాలకిషన్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేద మధ్యతరగతి ప్రజల నడ్డి విరుస్తోందని, అబద్ధాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ మాట మార్చి 25 లక్షల మంది ప్రజలపై 20 వేల కోట్ల భారాన్ని మోపుతుందని అన్నారు. ఈ నెల 12న కరీంనగర్‌లో జరిగే కదన భేరికి భారీసంఖ్యలో ప్రజలు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో చొప్పదండి ఎంపీపీ చిలుక రవీందర్, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఏనుగు రవీందర్‌రెడ్డి, చొప్పదండి, మానకొండూర్ మండలాల పార్టీ అధ్యక్షులు వెలుమ శ్రీనివాస్‌రెడ్డి, తాల్లపల్లి శేఖర్‌గౌడ్ తదితరుల పాల్గొన్నారు.

'సీఎం రేవంత్‌రెడ్డి మరో ఏక్‌నాథ్ షిండే'

గంగాధర, మార్చి 6: సీఎం రేవంత్‌రెడ్డి మరో ఏక్ నాథ్ షిండే కాబోతున్నారని బీఆర్ఎస్ మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. బుధవారం గంగాధరలో ముఖ్యకార్యకర్తల సమావేశానికి హాజరైన ఆయన మాట్లాడారు. తెలంగాణను గుజరాత్ మోడల్‌గా చేస్తానని మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. తెలంగాణలో పదేళ్లలో ఏం అభివృద్ధి జరగలేదని సీఎం రేవంత్ రెడ్డి చిత్రీకరణ చేస్తున్నారని ఆరోపించారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కరీంనగర్ నుంచి గెలిపిస్తే ప్రశ్నించే గొంతుకనవుతానన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

తాగునీటిపై సమీక్ష సమావేశం

సైదాపూర్, మార్చి 6: వేసవి కాలం సమీపించడంతో జిల్లా పంచాయతీ అధికారి రవీందర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈలు సైదాపూర్ ఎంపీడీవో కార్యాలయంలో మండల, గ్రామస్థాయి అధికారులతో తాగునీటిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. డీపీవో మాట్లాడుతూ రాబోయే మూడు నెలల కాలంలో గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా నివారణ చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో యాదగిరి, తహసీల్దార్ మంజూల, ఎంపీవో సురేందర్, పంచాయతీ కార్యదర్శులు, ప్రత్యేకాధికారులు పాల్గొన్నారు.


ఉపాధిహామీ పనుల పరిశీలన

సైదాపూర్, మార్చి 6: మండలంలోని గొడిశాలలో నేషనల్ రిమోట్ సెన్సింగ్(ఎన్ఆర్ఎస్) నుంచి ఉపాధిహామీ పథకం కింద చేపట్టిన పనులను సైంటిస్టులు జోషి, బూర్ల అనిల్, సీఆర్‌డీ అభయ్ కుమార్ రెండు రోజుల పర్యటనలో భాగంగా బుధవారం పరిశీలించారు. ఫారం పాండ్స్, హరితహారం, నర్సరీ, పల్లె ప్రకృతి వనం, ఇతర ఉపాధిహామి పనులను సమీక్షించారు. కార్యక్రమంలో ఎంపీడీవో యాదగిరి, ఏపీవో రాణి, ఈసీ శ్రీధర్, టీఏలు మధు, అశోక్ పంచాయతీ కార్యదర్శి సుమన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో గొర్రెల కాపరి మృతి

ఓదెల, మార్చి 6: అడవి పందుల నుంచి మొక్కజొన్న పంటను రక్షించుకునేందుకు అమర్చిన విద్యుత్ తీగలు ఓ వలస గొర్రెల కాపరికి యమపాశమైంది. మండలంలోని జీలకుంటలో బుధవారం కరీంనగర్ జిల్లా ఆబాద్ జమ్మికుంటకు చెందిన కొమ్ము కొమురయ్య (60) అనే వలస గొర్రెల కాపరి బుధవారం విద్యుత్ తీగలు తగిలి మృతి చెందాడు. ఇంటి నుంచి గొర్రెల గుంపుతో పదిరోజుల క్రితం కొమురయ్య బయలుదేరారు. ఎరువు అవసరం ఉన్న రైతులకు భూసారం కోసం గొర్రెల మందల ను పెట్టుకుంటూ వారం క్రితం ఓదెల మండ లం జీలకుంటకు వచ్చాడు. ఇక్కడ వారం నుంచి అవసరమున్న రైతుల భూముల్లో గొర్రెల మందలు పెట్టుకొని జీవనం కొనసాగిస్తున్నాడు. ఈ తరుణంలో తెల్లవారుజామున బహిర్భూమి కనీ ఇదే గ్రామానికి చెందిన బంగారి కొమురయ్య అనే వ్యక్తికి చెందిన మొక్కజొన్న పంట వైపు వచ్చాడు. అడవి పందుల నుంచి పంట రక్షణ కోసం అప్పటికే మొక్కజొన్న పంట చుట్టూరా విద్యుత్ తీగలను అమర్చి ఉండడంతో వాటికి తగిలి గొర్రెల కాపరి కొమురయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. వెంటనే సంఘటన స్థలానికి సీఐ సుబ్బారెడ్డి, ఎస్ఐ అశోక్‌రెడ్డి చేరుకొని పరిశీలించారు. అనంతరం మృతుడి కుమారుడు సురేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అక్రమంగా విద్యుత్ తీగలను అమర్చిన బంగారి కొమురయ్యపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటాం



ఎంపీటీసీకి పార్టీ కండువా కప్పుతున్న ప్రణవ్

ఇల్లందకుంట, మార్చి 6: కాంగ్రెస్ పార్టీలోని ప్రతీ కార్యకర్తకు అండగా ఉంటూ కంటికి రెప్పలా కాపాడుకుంటామని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకు చెందిన నాయకులు, బోగంపాడు ఎంపీటీసీ ఎక్కటి సంజీవరెడ్డి, బీఆర్ఎస్ మాజీ మండలాధ్యక్షు డు బీనవేణ మహిపాల్‌యాదవ్, మండల కో-ఆప్షన్ సభ్యుడు లాల్ మహ్మద్ వొడితెల ప్రణవ్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ త్వరలో జరగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో కరీంనగర్ ఎంపీ కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షు డు ఇంగిలే రామారావు, వంగ రామకృష్ణ, సారంగపాణి, రాజబాబు, ఎల్లయ్య పాల్గొన్నారు.

అక్రమ పట్టా చేసిన నలుగురిపై కేసు నమోదు

వీణవంక, మార్చి 6: మండల కేంద్రంలో అక్రమ పట్టా చేసిన నలుగురిపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ వంశీకృష్ణ తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం వీణవంక గ్రామనికి చెందిన రామిడి శివప్రియ అమెరికాలో ఉంటోంది. ఆమె పేరు మీద గల సర్వే నంబర్ 1224ఏ లో ఆరు గుంటలు, 1230.2..1లో 16 గుంటల భూమిని గత సంవత్సరం రెవెన్యూ కార్యాలయంలో ధరణి ఆపరేటర్ అరుస్ చౌదరితో కుమ్మకై వీణవంకకు చెందిన సుకాసి సురేష్, నీల పూర్ణచందర్, మహ్మద్ అక్బర్ శివప్రియ ఫొటో సంతకాలు ఫోర్జరి చేసి సుకాసి సురేష్ పేరు మీద 22 గుంటల పట్టా చేసినట్టు తహసీల్దార్ తిరుమల్‌రావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో నలుగురిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గణేశ్‌నగర్, మార్చి 6: నగరంలో చెట్ల కొమ్మల తొలగింపులో భాగంగా గురువారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు వివిధ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్ టు ఏడిఈ సుధీర్ కుమార్ తెలిపారు. విద్యుత్ సరఫరా నిలిపి ప్రాంతాలు పండస్ స్కూల్ ఏరియా, ముకరంపూర్, భగత్‌నగర్ రోడ్ నంబర్ 5 నుంచి రోడ్ నంబర్ 9వరకు, 3ఎ, శ్రీ చైతన్య జూనియర్ కళాశాల నుంచి బృందావన్ ఫంక్షన్ హాల్ వెనుక వైపు ప్రాంతంలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. మధ్యాహ్నం మూడు గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు ఉజ్వలపార్క్ సబ్‌స్టేషన్ ప్రాంతం, అల్కాపురి కాలని, ఎన్టీఆర్ విగ్రహం, కోతిరాంపూర్, గణేశ్‌నగర్, హనుమాన్ నగర్, దోబీవాడ, కట్టరాంపూర్ ఏరియా, తిరుమలనగర్, వినాయకనగర్, శ్రీనివాసనగర్, గౌతమినగర్, షై విలేజ్ బ్యాక్ సైడ్ ఏరియా, కట్టరాంపూర్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేటి బల్దియా దుకాణాల కేటాయింపు వాయిదా

కరీంనగర్ టౌన్, మార్చి 6: నగరపాలక సంస్థ నిర్మించిన వాణిజ్య సముదాయ దుకాణాలను కేటాయించేందుకు ఈనెల 7న నిర్వహించతలపెట్టిన లాటరీ కార్యక్రమాన్ని అనివార్య కారణం వల్ల వాయిదా వేసినట్లు మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. సివిల్ హాస్పిటల్, శాతవాహన యూనివర్శిటీ సమీపంలో నిర్మించిన దుకాణాల కేటాంపు కార్యక్రమాన్ని తిరిగి ఎప్పుడు నిర్వహించే తేదీని ప్రకటిస్తామని పేర్కొన్నారు.

రంజాన్ క్యాలెండర్ ఆవిష్కరణ

కరీంనగర్ రూరల్, మార్చి 6: బొమ్మకల్ గ్రామంలో రంజాన్ క్యాలెండర్‌ను కరీంనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి పురమల్ల శ్రీనివాస్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎండి షహానవాజ్‌ద్దీన్, అస్గర్, ఆరిఫ్, ఇమ్రాన్, జోజిరెడ్డి, వేణు, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

పీఏసీఎస్ చైర్మన్‌కు సన్మానం

కరీంనగర్ రూరల్, మార్చి 6: కరీంనగర్ రూరల్ మండలం దుర్శేడ్ పీఏసీఎస్ చైర్మన్‌గా ఎన్నికైన తోట తిరుపతిని ఎమ్మెల్యే గంగుల కమలాకర్ బుధవారం సన్మానించారు. పీఏసీఎస్ చైర్మన్ తోట తిరుపతి డైరెక్టర్లతో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా వారిని సత్కరించారు. కార్యక్రమంలో గ్రామ మాజీ ఉపసర్పంచ్ సుంకిశాల సంపత్‌రావు, కోరుకంటి వేణుమాధవరావు, సింగిల్‌విండో డైరెక్టర్లు గాజుల అంజయ్య, కుంభం అంజలి, బిజిలి పోషాలు, కందుల రమేష్, వేల్పుల రాజు, శ్రీరామోజు తిరుపతి, గుండేటి కుమార్, ముత్తునూరి రాజ్‌కమల్, కుంభం శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

వైస్ ఎంపీపీకి అభినందన

కరీంనగర్ రూరల్, మార్చి 6: కొత్తపల్లి వైస్ ఎంపీపీగా ఎన్నికైన భూక్య తిరుపతినాయక్‌ను ఆల్ ఇండియా బంజారా సేవాసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు లకావత్ రూప్‌సింగ్ బుధారం అభినందించారు. కార్యక్రమంలో గిరిజన నాయకులు తిరుపతి నాయక్, రాజునాయక్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

● సంక్షిప్త సమాచారం..

●సుభాష్‌నగర్: కరీంనగర్ కాంగ్రెస్ ఎంపీ టికెట్ తన పేరును పరిశీలించాలని ప్రజామిత్ర వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు కొరివి వేణుగోపాల్ అన్నారు. బుధవారం నగరంలోని ప్రజామిత్ర కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ అభ్యర్థి వినోద్‌కుమార్, బీజేపీ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్‌లను ఎదుర్కొనే శక్తి సామర్థ్యాలు తనకు ఉన్నాయన్నారు.

●కరీంనగర్ రూరల్: లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్ రేకుర్తి డాక్టర్ భాస్కర్ మాడేకర్ కంటి ఆసుపత్రిలో యూనియన్ బ్యాంకు ఏటీఎంను బ్యాంకు రీజినల్ హెడ్ అపర్ణరెడ్డి బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఆసుపత్రి చైర్మన్ కొండ వేణుమూర్తి, డిప్యూటి మేనేజర్ హెడ్, బురంచి నారాయణ మిశ్రా, బ్రాంచి హెడ్ భాస్కర్‌రావు, వైస్ చైర్మన్ చిదుర సురేష్, కోశాధికారి బొమ్మ పవన్‌కుమార్, డాక్టర్ టి మురళీధర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

● హుజూరాబాద్: హుజూరాబాద్ పట్టణం కేసీ క్యాంపులోని రైతు వేదికలో రైతులకు ఆధునిక సాంకేతిక విధానాలపై అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభించారు. డీడీఏ శత్రునాయక్, ఏడీఏ సునీత, ఏవోలు సునీల్‌కుమార్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, రజిత, గణేష్ పాల్గొన్నారు.

- ఈ నెల 12న రంజాన్ మాసం సందర్భంగా ఏర్పాట్లు చేయాలని కోరుతూ బుధవారం కాంగ్రెస్ మైనార్టీ నాయకులు మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, ఏసీపీ శ్రీనివాస్‌జీకు వినతిపత్రం సమర్పించారు. ఎండీ అఫ్సర్, సిరాజ్, జలీల్, నవాజ్, అన్ను యాసిన్‌పాషా, సలీం, షరీఫ్ పాల్గొన్నారు.
- హుజూరాబాద్ పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన మాడ్గుల ప్రవీణ్ అనారోగ్యంతో మృతి చెందగా, బుధవారం కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ ఆయన పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

● సైదాపూర్: మండల వ్యాప్తంగా గృహజ్యోతి పథకంలో భాగంగా తెల్ల రేషన్ కార్డు కలిగి ఉండి జీరో కరెంటు బిల్లు రానివారు ఎంపీడీవో ఆఫీసులో ఏర్పాటు చేసిన ప్రజాపాలన హెల్ప్ డెస్కులో తమ రేషన్ కార్డు, ఆధార్‌కార్డు, ఇంటి విద్యుత్ కనెక్షన్ నంబర్ వివరాలతో దరఖాస్తు చేసుకోవాలని ఆపరేషన్ ఏఈ ఆంజనేయులుగౌడ్ కోరారు.

● గంగాధర: మండలంలోని ర్యాలపల్లికి చెందిన తెట్టె ఎల్లయ్య రోడ్డు ప్రమాదంలో, కాచిరెడ్డిపల్లికి చెందిన ఇడుగురాల లక్ష్మి ఇటీవల గుండెపోటుతో మృతిచెందగా వారి కుటుంబసభ్యులను ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పరామర్శించి ఆర్థిక సహాయం అందించారు.

- చొప్పదండి బీఆర్ఎస్ యూత్ జనరల్ సెక్రెటరీగా గట్టుబూత్కూర్‌కు చెందిన బుర్ర అజయ్‌గౌడ్ బుధవారం నియామకం అయ్యారు.

● చొప్పదండి: మండలంలోని రుక్మాపూర్‌లో బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ కుమార్ ప్రజాహితయాత్ర గురువారం ప్రారంభం అవుతుందని బీజేపీ జిల్లా ప్రధానకార్యదర్శి బత్తుల లక్ష్మీనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు.

● మానకొండూర్: మండలంలోని అన్నారంలో కరీంనగర్‌లోని వాగేశ్వరీ డిగ్రీ, పీజీ కళాశాల ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఎన్ఎస్ఎస్ క్యాంపులో హరితహారం కార్యక్రమాన్ని నిర్వహించారు.

● ఇల్లందకుంట: మండలంలోని కనగర్తికి చెందిన సాదిరేపు మధునయ్య మోకాలుకు శస్త్ర చికిత్స నిమిత్తం రూ. 1.50 లక్షల ఎల్వోసీని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ అందజేశారు.

● వీణవంక: మండలంలోని కనపర్తిలోని శివాలయ పునరుద్ధరణకు మహకాళ సాంబశివరెడ్డి, సుగుణాకర్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి రూ. రెండు లక్షలు విరాళంగా ఇచ్చారు.

● హుజూరాబాద్ రూరల్: మండలంలోని సింగాపూర్ గ్రామంలోని వీఎస్సార్ డిగ్రీ కళాశాల లైఫ్‌సైన్స్ విద్యార్థులు కాకతీయ మెడికల్ కళాశాలను బుధవారం సందర్శించినట్లు ప్రిన్సిపాల్ వీఎన్ హనుమకుమార్ తెలిపారు.

● జమ్మికుంట రూరల్: మండలంలోని శాయంపేటలో హైమాస్ట్ లైట్లను జడ్పీటీసీ డాక్టర్ శ్రీరామ్ శ్యామ్ బుధవారం ప్రారంభించారు.

● జమ్మికుంట: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.7400 పలికింది. మార్కెట్ యార్డుకు 65మంది రైతులు 795క్వింటాళ్ల విడిపత్తి, ఎనిమిది మంది రైతులు 11క్వింటాళ్ల గోనె సంచుల్లో విక్రయానికి తీసుకు వచ్చారు.